

కఠిన చట్టాలు అమలు చేయాలి

రోగులకు సేవలందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దారుణం. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలను అమలు చేయాలి. దాడులకు పాల్పడిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు భద్రత కల్పించేందుకు స్పెషల్ పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి.

– డాక్టర్ సురేష్, పీహెచ్‌సీ వైద్యులు, గాడిమొగ



వైద్యుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనతో దేశంలో మహిళా వైద్యులంతా ఆందోళనకు గురవుతున్నారు. ఆసుపత్రుల వద్ద రోగులు, వారి బంధువులకు ముందస్తు తనిఖీలు నిర్వహించిన తరువాతే వారిని లోపలికి అనుమతించాలి. వైద్యుల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటేనే మహిళా వైద్యులకు భరోసా లభిస్తుంది.

– డాక్టర్ నవీన్, వైద్యులు, యానాం ప్రభుత్వ ఆసుపత్రి

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు

- సమీకృత వ్యవసాయంతో లాభాల పంట
- వివిధ రకాల పంటలతో ప్రతి నెలా నికర ఆదాయం

తాళ్లరేవు: కాలానుగుణంగా వ్యవసాయంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటివరకూ రైతులు ప్రాంతాన్ని బట్టి, వాతావరణ పరిస్థితులు, భూసారాన్ని అనుసరించి వ్యవసాయాన్ని చేసేవారు. అయితే ప్రస్తుతం లాభాలే ప్రామాణికంగా వ్యవసాయం చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలైన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వరిపంటకు అనుకూలం కావడంతో అధిక శాతం మంది వ్యవసాయం చేసి జీవనం సాగించేవారు. ఒకప్పుడు అధిక శాతం మంది వరి సాగు చేయగా, కొద్ది మంది మాత్రమే కొబ్బరి, అరటి, పసుపు, మిర్చి, కాయగూరలు వంటి అనుబంధ పంటలు పండించేవారు. కాలక్రమేణ రొయ్యలు, చేపల సాగు అధికమవడం, అధిక మొత్తంలో లాభాలు ఆర్జిస్తుండడంతో తీర ప్రాంతాలతో పాటు ఏడాదికి మూడు పంటలు పండే వరి భూములను సైతం చెరువులుగా మార్చి సాగు చేపట్టారు. అయితే ఆక్వా పరిశ్రమలోనూ వరుస నష్టాలు సంభవించడం, కనీస పెట్టుబడులు కూడా రాకపోతుండడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారు.

చిన్న, సన్నకారు రైతులకు వరం

వరుస నష్టాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు సమీకృత వ్యవసాయం(ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం) ఒక వరంలా మారనుంది. వరి, ఆక్వా పరిశ్రమల్లో నష్టాల పాలైన రైతులకు ఈ విధానం ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. చిన్నపాటి స్థలంలోనే అటు వరి, ఇటు రొయ్యలు, చేపల పెంపకంతో పాటు సుమారు పది రకాలకు పైగా పంటలు నాటుకోళ్లు, గొర్రెలతో పాటు కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు పండించే అవకాశం ఉండడంతో అధిక శాతం మంది ఆసక్తి చూపుతున్నారు. గత ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. ఇప్పటికే తాళ్లరేవు మండలంలో వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి పర్యవేక్షణలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వి.వెంకటరమణ సూచనల మేరకు చొల్లంగి రైతు భరోసా కేంద్రం పరిధిలో కట్టిమేను నూకరాజు అనే రైతు సమీకృత వ్యవసాయ సాగును చేపట్టారు. ఈ విధానం ద్వారా అధిక లాభాలు ఆర్జించినట్లు రైతు నూకరాజు చెపుతున్నారు.



వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న నాటుకోళ్లు



సమీకృత వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న చేపలు



చెరువు గట్లపై వేసిన ఆకుకూరలు, జామ, మునగ మొక్కలు

ఐఎఫ్ఎస్ విధానంతో అధిక లాభాలు



సమీకృత వ్యవసాయం(ఐఎఫ్ఎస్ విధానం) ద్వారా వరితో పాటు ఇతర పంటల సాగు చేసే అవకాశం ఉండడంతో పంట దిగుబడి అధికంగా ఉండి రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. ఈ విధానం ద్వారా 1.5 ఎకరాల భూమిలో 80 సెంట్లలో వరి సాగు, 20 సెంట్లలో చేపల పెంపకం, 10 సెంట్లలో కాలువపై నాటుకోళ్ల పెంపకం, 20 సెంట్లలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు తదితర వాటిని సాగు చేసుకుని లాభాలు ఆర్జించవచ్చు. అలాగే మిగిలిన 20 సెంట్ల భూమిలో గొర్రెల పెంపకం, ఇతర గడ్డి జాతి పెంపకం చేపడతారు. ఈ విధానంలో రైతులకు ఏ కారణం చేతనైనా ఒక పంటలో నష్టం వచ్చినా మిగిలిన పంటల్లో లాభాలు ఆర్జించవచ్చు.

– ఎస్.ప్రశాంతి, వ్యవసాయాధికారి, తాళ్లరేవు మండలం

ప్రతి నెలా నికర ఆదాయం



సాధారణంగా వరి, ఆక్వా పంటల దిగుబడులు చేతికి రావాలంటే సుమారు నాలుగు నుంచి ఆరు నెలల కాలం పడుతుంది. అదేవిధంగా ఒక ఎకరా సాగుకు సుమారు రూ.లక్షకు పైగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ విధానం ద్వారా తొలి ఏడాది దాదాపుగా రూ.35,000 నుంచి రూ.50,000 వరకూ ఖర్చవుతుంది. పెట్టుబడి పెట్టిన ఐదు నెలల నుంచి ప్రతి నెలా రైతుకు నికర ఆదాయం సమకూరుతుంది. ఒక ఏడాదిలో రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహిస్తుంది. దీనికి సంబంధించి ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం.

– వి.వెంకటరమణ, గ్రామ వ్యవసాయ సహాయకుడు, చొల్లంగి రైతు భరోసా కేంద్రం

కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తూ ధర్నా



కాట్రేనికోన గేటు సెంటర్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

కాట్రేనికోన: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం, శానిటేషన్ సిబ్బంది తొలగింపును వ్యతిరేకిస్తూ కాట్రేనికోన గేటు సెంటర్‌లో సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. మండల సీఐటీయూ నాయకులు విత్తనాల రాంబాబు, కోకన్వీనర్ విప్పర్తి మోహనరావు మాట్లాడుతూ టీడీపీ అధికారం చేపట్టిన తరువాత కార్మికులను విధుల్లోంచి తొలగించి వేధింపులకు పాల్పడుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని మండిపడ్డారు. కొప్పిగుంట పాఠశాలలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలిని తొలగించి, టీడీపీ కార్యకర్తను నియమించేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో దుర్గా మహేశ్వరి, ఎ.దుర్గ, బొంతు పార్వతి, గుత్తుల కనకదుర్గ, మల్లు వెంకటలక్ష్మి, అనంతలక్ష్మి, భవాని, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోగి మృతిపై బంధువుల నిరసన

అమలాపురం టౌన్: వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబ సభ్యుడు మృతి చెందాడని ఆరోపిస్తూ అతడి బంధువులు స్థానిక శ్రీహరి ఆస్పత్రి ఎదుట బుధవారం ఉదయం నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన బి.కనకరాజు(53) శ్రీహరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో కనకరాజు బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం రోగి బంధువులు, ఆసుపత్రి యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమించారు. ఈ విషయంపై పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్‌ను వివరణ కోరగా రోగి బంధువులు నేచురల్ డెత్ అని రిపోర్టు ఇచ్చారని చెప్పారు. ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

అమలాపురం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మూడురోజుల ఆందోళనలో భాగంగా బుధవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్రాల్లో వసతి గృహాలకు ప్రత్యేక బడ్జెట్ కావాలని, నిరుపేద, బడుగు బలహీనవర్గాలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో మగ్గిపోవాలా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి పేద విద్యార్థుల సంక్షేమం పట్టదా అని నిలదీశారు. బాలిక వసతి గృహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొరబాబు, పల్లంరాజు, వెంకట్, సతీష్, ప్రసాద్, ఉదయ్, చిరు, పవన్, మహమ్మద్, నాని, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకులు

ఘనంగా వినాయచవితి రాట ముహూర్తం



రాట ముహూర్తం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని కనకాలపేటలో కొలువైన వరసిద్ధి వినాయక ఆలయంలో 16వ నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాట ముహూర్తం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోటుపల్లి రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బాలగణపతి ఆలయంలో రాట ముహూర్తం నిర్వహిస్తున్న గ్రామస్తులు

జార్జిపేటలో..

తాళ్లరేవు: జార్జిపేటలో కొలువైన బాలగణపతి ఆలయంలో గణపతి నవరాత్ర మహోత్సవాలకు బుధవారం రాట ముహూర్తాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు ఆకొండి వ్యాసమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీల గృహాలకు త్వరలో రూ.5 లక్షలు

యానాం: నియోజకవర్గ పరిధిలో 1996 తుఫాను అనంతరం నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వాటి స్థానంలో నూతన గృహాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 28 ఏళ్ల క్రితం ఆదిద్రావిడ శాఖ ద్వారా రూ.35 వేలతో రెండు గదుల ఇళ్ల నిర్మాణం జరిగిందని, అయితే అవి ప్రస్తుతం అవసాన దశకు చేరుకున్నాయన్నారు. దరియాలతిప్ప, దొమ్మేటిపేట తదితర గ్రామాల్లో సుమారు 250 ఇళ్ల వరకూ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటి స్థానంలో నూతన ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేయాలని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తాను కోరడంతో ప్రభుత్వం స్పందించిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఎస్సీల గృహాలకు ఆర్థిక సాయం అందనుందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఆకట్టుకుంటున్న చిత్రాలు



గిడుగు రామమూర్తి చిత్రం

అమలాపురం రూరల్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి సేవలను స్మరించుకుంటూ అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ గీసిన తెలుగు తల్లి, గిడుగు వెంకట రామమూర్తి చిత్రం అందరినీ ఆకట్టుకుంది. అలాగే హాకీ క్రీడాకారుడైన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నరసింహ చంద్రకుమార్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రాన్ని వేసి చిత్ర నివాళి అర్పించారు.



చంద్రకుమార్ వేసిన ధ్యాన్‌చంద్ చిత్రం



చిత్రకారుడు అంజి గీసిన చిత్రం

కాట్రేనికోన: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాష కమ్మదనం, మాతృభాషపై తనకున్న అభిమానంతో కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకొండి అంజి గీసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం బతకటానికి ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషని మాత్రం మరవకూడదన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పరిరక్షించడంతో పాటు భక్తి భావాన్ని పెంచాలని విశ్వ హిందూ పరిషత్ ప్రాంత అధికారి సాయిరామ్ అన్నారు. పుల్లేటికుర్రులో వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దివస్‌ను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ చేపట్టిన అక్షితాన్ అయోధ్య, అక్షితాన్ అభియాన్, రథయాత్ర, సామూహిక వరలక్ష్మి వ్రతాలను జిల్లాలో నిర్వహించామన్నారు. సమావేశంలో కార్యదర్శి ప్రయోగ నరసింహమూర్తి, భమిడిపాటి కృష్ణమూర్తి, కడలి వెంకటేశ్వరరావు, అయ్యగారి వెంకట్రావు, వాడ్రేవు శ్రీరామచంద్రమూర్తి, కాండ్రేగుల వెంకటరమణ, మేడేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పుల్లేటికుర్రులో మాట్లాడుతున్న సాయిరామ్

మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి

మలికిపురం: మండలంలోని లక్కవరం పీహెచ్‌సీ ఆవరణలో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం లక్కవరంలోని పీహెచ్‌సీని, పీహెచ్‌సీకి ఉన్న అదనపు భూమిని రెవెన్యూ అధికారులు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. పీహెచ్‌సీకి గతంలో దాతలైన మంగెన కుటుంబాలు 2.59 ఎకరాల భూమి విరాళంగా ఇచ్చారని ఎమ్మెల్యేకు స్థానికులు తెలిపారు. ఇక్కడ సరైన వైద్య సౌకర్యాలు లేక అధునాతన వైద్య సౌకర్యాలకు వేర్వేరు పట్టణాలకు తప్పని పరిస్థితుల్లో రోగులు అవస్థలు పడి వెళుతున్నారని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజోలు సీహెచ్‌సీ అభివృద్ధికి నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు సహకరించడానికి ముందుకు వచ్చారని, అదే విధానంలో లక్కవరం పీహెచ్‌సీ ఆవరణలో కూడా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ కోట పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలు వీరే

యానాం: పుదుచ్చేరి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్విజ్ పోటీల్లో బహుమతులు సాధించిన విజేతల వివరాలను ఆర్‌పీఓ మునిస్వామి బుధవారం వెల్లడించారు. గుత్తుల వెంకట పవన్ తేజ ప్రథమ స్థానాన్ని, బి.యశస్వీరత్న ద్వితీయ స్థానాన్ని, బి.ఇషాన్ సాగర్ తృతీయ స్థానాన్ని, పొలిమారి అభినవ సత్యగణేష్ నాలుగో స్థానాన్ని సాధించారన్నారు. చిక్కం నిషి, చెక్కా హాసిని, జి.ప్రజ్ఞ వీరశ్రీలాస్య, ఎం.సతిత సాయిశ్రీ, అమృతవర్షిణి, రిచల్‌లిలియాన్‌లు కన్సొలేషన్ బహుమతులు సాధించారని తెలిపారు.

స్నేహితుని కుమార్తె వివాహానికి సహాయం

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1983–84లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి మిత్రుడి కుమార్తె వివాహానికి రూ.40 వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. తమ స్నేహితుడైన తణుకు రాంబాబు ఒక చిన్న ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమార్తె వివాహానికి స్నేహితులందరూ కలిసి వెళ్లి నగదు అందించి కష్ట సుఖాలలో తామున్నామంటూ భరోసా కల్పించారు. వారందరికీ రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీపై సమీక్ష

యానాం: పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు అందించనున్న నిత్యావసరాల పంపిణీపై ఎలా ముందుకెళ్లాలో అధికారులతో రోజూ సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తిరుమురుగన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఉచిత బియ్యం పంపిణీ పథకంతో పాటు నిత్యావసరాలను సబ్సిడీ ధరలకు రేషన్ షాపుల ద్వారా అందజేయనున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో దశల వారీగా దాని అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేశామన్నారు. దీంతో సివిల్ సప్లయిస్ కార్యదర్శి ఎ.ముత్తమ్మ, డైరెక్టర్ సత్యమూర్తిలతో ఎప్పటికప్పుడు తీసుకున్న చర్యలపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

నీట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థికి సన్మానం



సాయికుమార్‌ను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షులు ఆదిత్యకుమార్

మామిడికుదురు: నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 416వ ర్యాంకు సాధించిన రాజోలు మండలం ములికిపల్లికి చెందిన కొడవటి సాయికుమార్‌ను మామిడికుదురులో బుధవారం ఘనంగా సన్మానించారు. మామిడికుదురుకు చెందిన వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్‌తో పాటు పలువురు స్థానికులు సాయికుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు. కార్యక్రమంలో రాజోలు మాజీ పీఏసీఎస్ మాజీ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు, అడబాల బుజ్జి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం రాణి

ఉప్పలగుప్తం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన 36 మందికి బహుమతులు, ప్రశంసాపత్రాలు గురువారం అందజేస్తామని పీడీ గొలకోటి ఫణి తెలిపారు. ప్రధానోపాధ్యాయిని లంకా రాణి, సరస్వతి, విజయభాస్కర్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విద్యార్థిని ప్రహర్షిణికి బహుమతి అందజేస్తున్న ఆర్‌పీఓ మునిస్వామి

యానాం: డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం ఆర్‌పీఓ మునిస్వామి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణ, అవగాహనపై ఇటీవల నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని ప్రహర్షిణిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, జీజీహెచ్ డీడీ టి.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



విరాళం అందజేసిన దాతలను సత్కరిస్తున్న ఈవో లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు మండపేటకు చెందిన శ్రీ నిమ్మలపూడి నాగేంద్ర దంపతులు రూ.10,116 విరాళంగా సమకూర్చారు. సదరు మొత్తాన్ని ఆలయ సహాయ కమిషనర్, ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం అందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో శేష వస్త్రం, స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఈవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వామివారికి సమర్పించే కానుకలు, మొక్కుబడులు, నిత్యాన్నదాన విరాళాలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే అవకాశం ఉందన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: సుంకరపాలెం ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పల్లిపాలెం, సుంకరపాలెం, బైపాస్, లచ్చిపాలెం, ఉప్పాంగల, తంగేటిపంపు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు కాకినాడ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

నేడు 5కే రెడ్ రన్ పోటీ

యానాం: యువతకు హెచ్ఐవీ నివారణపై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 29వ తేదీ ఉదయం 6.30 గంటలకు పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో 5కే రెడ్ రన్ పోటీని నిర్వహించనున్నట్లు ఆర్‌పీఓ మునిస్వామి తెలిపారు. దేశ జనాభాలో 25 శాతం ఉన్న యువతకు హెచ్ఐవీపై సమగ్ర అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

వెటర్నరీ వైద్యులు గ్రామాల్లో సేవలందించాలి

యానాం: వెటర్నరీ వైద్యులు తప్పనిసరిగా గ్రామాల్లోకి వెళ్లి అక్కడ పశువులకు వైద్య సేవలు అందించాలని సీఎం రంగసామి ఆదేశించారు. బుధవారం రాజీవ్‌గాంధీ వెటర్నరీ కాలేజీ 25వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కళాశాల మౌలిక వసతులు, అత్యాధునిక ల్యాబ్‌లతో కూడిన సదుపాయాలతో ఆసియాలోనే అత్యుత్తమ కళాశాలగా నిలిచిందన్నారు. లైవ్‌స్టాక్ సెక్టార్ సైతం వ్యవసాయానికి అనుబంధంగా ఉంటూ రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తుందన్నారు. అనంతరం 72 మందికి గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి జయకుమార్, స్పీకర్ సెల్వం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్, వెటర్నరీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.